క్లుప్తంగా

రైతులకు రవాణా బకాయిలు చెల్లించాలి

కరప: గతేడాది సార్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన సరుకుకు రెండు రోజులకే నగదు చెల్లించారని, రైతులకు రవాణా చార్జీలు ఇంతవరకూ చెల్లించ లేదని వేళంగి గ్రామానికి చెందిన రైతు వాసి రెడ్డి మోహనరావు తెలిపారు. ప్రభుత్వం రవాణా చార్జీలు రైతులకే చెల్లిస్తామంటున్నా, వాటిని ట్రాక్టర్ యజమానికి చెల్లించడం వల్ల రైతులకు నష్టం జరుగుతున్న తీరును గతేడాది నవంబర్ 4న కాకినాడ కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో అర్జీ ఇచ్చినట్టు మోహనరావు తెలిపారు. అప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇచ్చే ఎఫ్‌టీఓ(ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)లో వాహనం ఏర్పాటు చేసిన వారి కాలమ్‌లో అదర్స్ అని రాసేవారని చెప్పారు. ఫిర్యాదు ఇచ్చాక ఎఫ్‌టీఓలో రవాణా చేసింది రైతు అని రాసినా ఆ సొమ్ము జమ కాలేదని తెలిపారు. 75 కిలోల బస్తాకు రూ.25 వంతున రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. రవాణా చార్జీలు బకాయిలు చెల్లించాలని మండలంలోని రైతులందరూ కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

తపాలా ఉద్యోగుల సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాలాజీచెరువు: ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ డివిజన్ ఐదో ద్వైవార్షిక సమావేశం ఆదివారం కాకినాడలో జరిగింది. పెన్షనర్లకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యఅతిథిగా వైజాగ్ రీజియన్ సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజారావు హాజరయ్యారు. ఎనిమిదో వేతన కమిషన్ చైర్మన్, కమిటీ సభ్యులను వెంటనే నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కాకినాడ డివిజన్ అధ్యక్షుడు జీవీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి సత్తిరాజు, రంగయ్య, మార్కండేశ్వరరావు, డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు పాల్గొన్నారు.

గాంధీనగర్ లైబ్రరీలో 'చదవడం మాకిష్టం'


చదవడం మా కిష్టంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: నగరంలో ఉన్న గాంధీనగర్ గ్రంథాలయాల శాఖలో ఆదివారం ప్రత్యేకంగా చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆదివారం సండే స్టోరీ పేరుతో కార్యక్రమం జరిగింది. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై, చందమామ కథలు, అల్లాదీన్, డిస్లాంట్ కింగ్‌డమ్ తదితర పుస్తకాలు చదివారు. దాదాపు 150 మంది విద్యార్థులు సందర్శించారు. గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ఆర్‌ఎంసీకి పీజీ విద్యార్థుల వితరణ


ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాలలో అనస్థీషియా పీజీ పూర్తి చేసిన 2022 బ్యాచ్ విద్యార్థులు ఆర్‌వో వాటర్ ప్లాంట్ సహా, రెండు స్టాండ్ బీపీ ఆపరేటర్లు, మైసోరా అనస్థీషియా మాన్యువల్‌ను కాలేజీకి సమకూర్చారు. ఈ మేరకు ఆదివారం జీజీహెచ్‌లోని ఎస్‌ఎస్ వోటీ-1 క్లాస్ రూంలో ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గివ్ బ్యాక్ టు సొసైటీ ఆదర్శాన్ని కొనసాగించడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరి స్ఫూర్తితో విద్యార్థులు తమ డిపార్ట్‌మెంట్ల ప్రగతికి దోహదపడాలన్నారు. హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ప్రొఫెసర్ డాక్టర్ వింధ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అచ్యుత్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ శశికిరణ్, మత్తు విభాగ పీజీలు పాల్గొన్నారు.

పాడా కార్యాలయంలో నేడు గ్రీవెన్స్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్‌ఎస్(గ్రీవెన్స్) సోమవారం నిర్వహిస్తున్నట్టు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) పీడీ ఏ.చైత్రవర్షిణి తెలిపారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్దనున్న పాడా కార్యాలయంలో ఉదయం పది నుంచి కార్యక్రమం జరుగుతుందన్నారు. సంబంధిత డివిజనల్, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

అంధకారాన్ని పట్టించుకోరా?

- నగరంలో అనేక చోట్ల వెలగని విద్యుద్దీపాలు
- పలు ప్రాంతాల్లో చీకటిపడితే భయమే..


శ్రీరామ్‌నగర్‌లో వెలగని వీధి లైటు


దంటువారివీధిలో పరిస్థితి ఇలా..

బోట్‌క్లబ్: కాకినాడ నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ పేరును దక్కించుకున్నప్పటికీ.. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ విద్యుద్దీపాలు సక్రమంగా వెలగని దుస్థితి నెలకొని ఉంది. కొన్ని ప్రాంతాల్లో హైమాస్ట్ వెలుగులు విరజిమ్ముతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో కనీసం కరెంటు స్తంభాలకున్న లైట్లూ వెలగక అంధకారం అలుముకుంటోంది. చీకటి పడిందంటే కొన్ని ప్రాంతాల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. తమ ప్రాంతంలో విద్యుద్దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు చేసినా, అధికారులు స్పందించడం లేదని నగర ప్రజలు వాపోతున్నారు. కనీసం బల్బులు కొనుగోలు చేసేందుకూ కార్పొరేషన్‌లో సొమ్ము లేదని చెప్పడం విడ్డూరంగా ఉందంటున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యుద్దీపాల నిర్వహణ మరింత అధ్వానంగా తయారైందని నగరవాసులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం నగరంలో 36కి పైగా బ్రాందీ షాపులున్నాయని, వాటికి పర్మిట్ రూములకు కూడా అనుమతులు ఇవ్వడంతో.. ప్రస్తుతం చీకటిపడితే ఆయా షాపులు, పర్మిట్ రూముల వద్ద మందుబాబులు గుంపులుగా చేరి అటుగా వెళ్లేవారిని వేధిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. దీంతో అటువైపుగా వెళ్లాలంటే మహిళలు భయపడుతున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం కలిగిన కాకినాడ కార్పొరేషన్‌కు.. ప్రస్తుతం వీధి దీపాల నిర్వహణ కూడా సక్రమంగా చేయలేని దుస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్‌కు పాలకవర్గం లేకపోవడం వల్లే అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలో కౌన్సిల్ సమావేశాల్లో విద్యుద్దీపాల మరమ్మతులపై పలుమార్లు సభ్యులు అధికారులను నిలదీసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం కౌన్సిల్ లేక రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికలు జరగకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానిక టూటౌన్ ఓవర్ బ్రిడ్జి దిగువ నుంచి టౌన్ రైల్వేస్టేషన్ జవహర్ వీధి మీదుగా, మెయిన్ రోడ్డును అనుకుని సూర్యారావుపేట, సాలిపేట ప్రాంతాల్లో గంజాంవారి వీధి శివారు వరకు 57 వీధి స్తంభాలకు లైట్లు వెలగడం లేదు. స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లో ఉన్న హైమాస్ట్ స్తంభంపై రెండు లైట్లు వెలగడం లేదు. బ్రిడ్జిపై పలు దీపాలు వెలగకపోవడం వల్ల, వంతెన దిగువన రెండు వైపులా మార్గాల్లో చీకటి నెలకొంది. స్థానిక పైడావారి వీధిలోను వీధి దీపాలు వెలగకపోవడంతో, ప్రయాణికులు నిత్యం భయంభయంగానే రాకపోకలు సాగిస్తున్నారు.

ఎల్‌బీ నగర్ రోడ్డులో..

ఇలాఉండగా ఎల్‌బీ నగర్ రోడ్డులో పలు విద్యుద్దీపాలు వెలగడం లేదు. ఇటీవల నూతనంగా మద్యం దుకాణం, పర్మిట్ రూములు ఏర్పాటు చేయడంతో, ఇక్కడ మందుబాబులు వీరవిహారం చేస్తున్నారు. కొండయ్యపాలెం బ్రిడ్జిపై ప్రయాణికులతో ఈ రహదారి బిజీగా ఉంటుంది. పలు లైట్లు వెలగకపోవడంతో.. మద్యం దుకాణం కారణంగా ఈ రహదారిపై వెళ్లేందుకు మహిళలు భయపడుతున్నారు.

చీకటి పడిందంటే భయమే..


తరచూ వీధి లైట్లు వెలగని కారణంగా చీకటి పడితే కొన్ని ప్రాంతాల్లోని వీధుల్లో నడిచి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. వీధి దీపాలు నెలల తరబడి వెలగకపోయినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– బొద్దపాటి వెంకటగౌతమి, కాకినాడ

చాలా ఇబ్బందిగా ఉంది


బ్రాందీ షాపులున్న ప్రాంతాల్లో విద్యుద్దీపాలు వెలగని కారణంగా ఈ రోడ్లపై ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. వీధి లైట్లు వెలగకపోవడంతో మందుబాబులు రోడ్డు చివరన గుంపులుగా చేరి గలాటా సృష్టిస్తున్నారు.

– సిరెడ్డి రమ్య, కాకినాడ

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా
విద్యార్థులను తీర్చిదిద్దాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని జేఎన్‌టీయూకే ఉప కులపతి (వీసీ) సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ అన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న టెక్‌ఫెస్ట్ సౌధ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు ఎన్నో అవకాశాలున్నాయని అన్నారు. వాటిని అందిపుచ్చుకుని కలలు సాకారం చేసుకోవాలని సూచించారు. వికసిత్ భారత్-2047, వికసిత్ ఆంధ్రప్రదేశ్-47 మాదిరిగా వికసిత్ జేఎన్‌టీయూకే-2047కు అనుగుణంగా రోడ్ మ్యాప్ తయారు చేసి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేయాలని అన్నారు. రిటైర్డ్ కల్నల్ ఎంఎస్ ప్రభాకరరావు మాట్లాడుతూ, సాయుధ దళాల అధికారి కావడానికి గల అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. త్రివిధ దళాల్లోని వివిధ క్యాడర్లలో పోస్టులు, ఖాళీలు, ఆఫీసర్ లెవెల్ పోస్టులు, ఇండియన్ మిలిటరీ అకాడమీ, డిఫెన్స్ అకాడమీ తదితర అంశాలను వివరించారు. అనంతరం టెక్నికల్ సింపోజియంలో భాగంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి కోటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి చేయాలి

బోట్‌క్లబ్: నగరంలోని సంతచెరువు పార్కును అభివృద్ధి చేయాలని వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు వినతి పత్రం అందించారు. పది డివిజన్లకు చెందిన ప్రజలు ఈ పార్కులో నిత్యం వాకింగ్ చేస్తుంటారని, సాయంత్రంవేళ కుటుంబ సమేతంగా వచ్చేవారు నిత్యం చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వాకింగ్ ట్రాక్ పాడైపోవడంతో వాకర్స్ అవస్థలు పడుతున్నారన్నారు. పార్కులో మరుగుదొడ్లు లేకపోవడంతో సందర్శకులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. పార్కులో విద్యుద్దీపాలు పనిచేయకపోవడంతో.. రాత్రి సమయాల్లో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. ప్రముఖ వైద్యులు వి.వేంకటేశ్వరరావు, చెక్కా రమేష్, గొల్లపల్లి శివ పాల్గొన్నారు.

ఆర్‌ఎంసీ విద్యార్థుల యాంటీ డ్రగ్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు

కాకినాడ క్రైం: మాదక ద్రవ్యాలు అలవాటు చేసేందుకు యత్నించే స్నేహితులు, తెలిసిన వారికి నిర్మొహమాటంగా నో చెప్పాలని డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్(డీఎఫ్‌ఏపీ) నోడల్ అధికారి, కాకినాడ జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ అన్నారు. ఆదివారం రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాల మేరకు, డాక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎంసీ ఆవరణలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి ఈ ర్యాలీని ప్రారంభించారు. భానుగుడి జంక్షన్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో పాల్గొన్న వైద్య, నర్సింగ్ విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూడలిలో మానవహారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ, మత్తుకు బానిసైన వారి జీవితాలు దుర్భరం కావడమే కాకుండా, వారి కుటుంబాలకు అవమానాలు తప్పవన్నారు. మత్తు కేవలం మానసిక, శారీరక ఆరోగ్యాలను దెబ్బతీయడమే కాకుండా, న్యాయపరమైన చిక్కుల్ని తెచ్చి పెడుతుందని హెచ్చరించారు. మత్తుకు బానిసైన వారిని సమాజం దరి చేరనివ్వదన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే అన్నపానీయాల కంటే వాటికే ప్రాధాన్యమిస్తారని, దీనివల్ల ప్రాణాపాయం సంభవించవచ్చన్నారు. ర్యాలీలో సుమారు 300 మంది వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్‌ఎంసీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సౌమ్య, నర్సింగ్ కాలేజ్ అధ్యాపకురాలు మాధవి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వ్యాయామంతో మధుమేహం అదుపు


అవగాహన కల్పిస్తున్న వైద్యుడు దొరబాబు

కాకినాడ రూరల్: ఆరోగ్యాన్ని దెబ్బతీసే మధుమేహం వ్యాయామంతో అదుపులో ఉంటుందని ప్రముఖ వైద్యుడు శిరంగు దొరబాబు అన్నారు. వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోట్ క్లబ్ ఉద్యానవనంలో ఆరోగ్య అవగాహన సదస్సును నిర్వహించారు. మధుమేహం ఉన్న వారికి గ్లూకోజ్ మోతాదు అదుపులో లేకపోతే, శరీరంలో అన్ని అవయవాలు క్రమంగా క్షీణిస్తాయన్నారు. వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాబట్టి, ఏడాదికి ఓసారైనా మధుమేహ పరీక్షలు చేయించాలని సూచించారు. అధిక ఒత్తిడికి లోనవ్వడం, బరువు పెరగడం వంటి క్రియలకు దూరంగా ఉండాలని కోరారు. 30 శాతం మందికి ఈ వ్యాధి ఉందని గ్రహించలేకపోతున్నారన్నారు. గాయాల తగిలినప్పుడే ఎక్కువ మందికి మధుమేహం బయట పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అడబాల రత్నప్రసాద్, దాసరి శ్రీధర్, పీవీ రాఘవరావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ కన్న కలలు యువత సాధించాలి

స్వాతంత్య్ర యోధులకు ప్రముఖుల నివాళి


తూరంగిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


గుడిమెట్ల వారి వీధిలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులు

కాకినాడ సిటీ: భారత యువకిశోరాలు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ దేశం కోసం చేసిన త్యాగాలు, వారు కన్నకలలు సాధనకు యువత కృషి చేయాలని సీపీఎం నాయకులు సీహెచ్ అజయ్ కుమార్ అన్నారు. అల్లూరి సీతారామరాజుకాలనీ తూరంగిలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఆయనతో పాటు, పట్నాల వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్య్రం కావాలని, బ్రిటిష్ వారు నిష్క్రమించాలని జరిగిన పోరాటాల్లో భగత్‌సింగ్ చేసిన ఉద్యమానికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కక్కల శ్రీదుర్గ, పాట్నూరి సత్యవతి, సీహెచ్ విజయ, కంచి దుర్గాప్రసాద్, వెంకీ అమ్ము, తానవరపు రమ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

జాతీయ ఉద్యమ విప్లవ వీరకిశోరాలైన షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాల స్ఫూర్తితో మరో స్వాతంత్య్ర పోరాటానికి ఉద్యమిద్దామని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పిలుపునిచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, మాతృదేశ విముక్తి కోసం, దోపిడీ, పీడన అసమానతలు లేని సమాజం కోసం చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కిన అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కాకినాడ జగన్నాథపురం వంతెన వద్ద గుడిమెట్ల వారి వీధిలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి సంఘ నాయకులు కరుపోతు నవీన్‌కుమార్, ఎం.సాయి, ఎం.మూర్తి, నీలకంఠం, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరులకు ఘన నివాళులు

కాకినాడ రూరల్: దేశం కోసం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదురించి, పోరాడి ప్రాణత్యాగం చేసిన విప్లవ యోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు కాకినాడ రూరల్‌లో ఆదివారం ఘన నివాళులర్పించారు. పలు గ్రామాల్లో వీరి వర్ధంతిని నిర్వహించి, స్మరించుకున్నారు. ఆడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేటలో భగత్‌సింగ్ చిత్రపటానికి కుమార్‌యాదవ్, అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ తదితరులు నివాళులర్పించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

వలసపాకల గ్రామంలోని సుందరయ్య కాలనీలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభను నిర్వహించారు. సీఐటీయూ కార్యదర్శి టి.రాజా, సీనియర్ నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, చింతపల్లి అజయ్‌కుమార్, అంబటి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటరమణ, సత్యనారాయణ, బలరామ్ తదితరులు విప్లవవీరులకు నివాళులర్పించారు.

ఇంద్రపాలెంలో..

వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఇంద్రపాలెం మార్కెట్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలను వక్తలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు రోహిత్, మాజీ సర్పంచ్ గుత్తుల రామలింగేశ్వరరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు పెంకే వీరభద్రం, మన ఊరు-మన బాధ్యత స్వచ్ఛంద సంస్థకు చెందిన రామ్మోహన్, బాబ్జీ, డీవైఎఫ్‌ఐ నాయకులు వాసంశెట్టి చంద్రరావు, పెద్దింశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐడీఏ ఆధ్వర్యంలో..

కాకినాడ అర్బన్ రెండో డివిజన్ రమణయ్యపేటలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు ఘన నివాళులర్పించారు. ప్రాణాలు సైతం లెక్క చేయకుండా భరతమాత కోసం పోరాడిన మహావీరులు అని వక్తలు కొనియాడారు. వీరి త్యాగాలను దేశం మరువలేనిదని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు.

దేశ సంక్షేమం భగత్‌సింగ్ వారసుల లక్ష్యం

బోట్‌క్లబ్: సమాజహితంగా దేశ సంక్షేమాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ భగత్‌సింగ్ వారసులేనని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక రామకృష్ణారావుపేటలోని ఆయన విగ్రహానికి భరతమాత యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ వారిని ఎదురించిన స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ వంటి అమరవీరుల త్యాగాలు దేశ సమైక్యతకు వారధిగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ అధ్యక్షుడు మేళం గౌతమ్, కార్యదర్శి మహ్మద్ సులేమాన్, సభ్యులు ఉంగరాల కిరణ్, చిలుకూరి నూకరాజు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దూసర్లపూడి రమణరాజు


రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో భగత్‌సింగ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి


ఇంద్రపాలెం మార్కెట్ వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో..


కాకినాడ అర్బన్ రమణయ్యపేటలో భగత్‌సింగ్ విగ్రహానికి డాక్టర్ అడ్డాల నివాళి

రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

కరప: బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల(ఈడబ్ల్యూఎస్) స్వయం ఉపాధి కల్పనకు జిల్లా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 25 వరకు పెంచినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలు, ఈడబ్ల్యూఎస్ అనగా.. ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మిణ్ సామాజిక వర్గాల వారికి జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా, కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గం వారికి స్వయం ఉపాధి కోసం ఎంఎస్‌ఎంఈ పథకాల ద్వారా బ్యాంకు రుణం, ప్రభుత్వ రాయితీ మంజూరు చేస్తారని వివరించారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాపు సామాజిక వర్గానికి దరఖాస్తుదారు గరిష్ట వయసు 50 నుంచి 60 ఏళ్లకు పెంచినట్టు తెలిపారు. అర్హులైనవారందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పక్షులకు మడుగులు ఏర్పాటు చేయాలి


చెట్లకు మడుగు ఏర్పాటు చేస్తున్న పీవో

బాలాజీచెరువు: వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో జూన్ వరకూ పక్షులకు తాగునీరు, ఆహార సౌకర్యం కల్పించేందుకు మడుగులు ఏర్పాటు చేయాలని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. ఆదిత్య ఎన్‌ఎస్‌ఎస్ పీవో తేజేశ్వరరావుతో పాటు, విద్యార్థులు సంయుక్తంగా పక్షులకు నీటి, ఆహార మడుగులు తయారు చేసి, వాటిని చెట్లకు అమర్చారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకూ తమ ఇంటి ఆవరణలో ఇటువంటివి ఏర్పాటు చేసి పక్షులను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

సమాజంలో బాధ్యతగా మెలగాలి


డ్రోన్‌తో నిఘాను పర్యవేక్షిస్తున్న సీఐ

కాకినాడ క్రైం: కుటుంబ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని సమాజంలో బాధ్యతగా మెలగాలని కాకినాడ వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు రౌడీషీటర్లకు హితవు పలికారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లకు పాల్పడడం, శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం కంటే.. కుటుంబం, సమాజంలో విలువ ప్రధానమైనవని చెప్పారు. వారి ప్రవర్తనను బట్టి కుటుంబ సభ్యులకు సమాజంలో లభించే గౌరవం ఆధారపడి ఉంటుందన్నారు. బాధ్యతతో మెలిగితే బిడ్డల భవిష్యత్తు బాగుంటుందన్నారు. సన్మార్గంలోకి వచ్చేందుకు పోలీస్ శాఖ తరఫున అన్ని విధాలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు.

డ్రోన్లతో నిఘా

కాకినాడ వన్ టౌన్ పరిధిలో ఆదివారం డ్రోన్ నిఘా కొనసాగింది. వారాంతంలో తాగుబోతులు, జూదరులు, మాదక ద్రవ్యాలు తీసుకునే వారి ఆగడాలకు ఆస్కారం ఉండడంతో సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో డ్రోన్ నిర్వహణ బృందం నిఘా ఏర్పాటు చేసింది. నిర్మానుష్య ప్రదేశాలు, గతంలో నేరాలు ఎక్కువగా చోటు చేసుకున్న ప్రాంతాలే లక్ష్యంగా డ్రోన్ నిఘా కొనసాగింది.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి


వేంకటేశ్వరరావుకు అవార్డు అందజేస్తున్న చైర్మన్ రాజేంద్రన్

బాలాజీచెరువు: పురస్కారాలు, సత్కారాలు సమాజంలో మరింత బాధ్యతను పెంచుతాయని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు అన్నారు. చెన్నైలో ఆదివారం జరిగిన క్లబ్ ఇంటర్నేషనల్ దక్షిణ భారత కౌన్సిల్ సమావేశంలో వేంకటేశ్వరరావు అలయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును దక్షిణ భారత కౌన్సిల్ చైర్మన్ రాజేంద్రన్ అందించారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు తిరుపతిరాజు, కొడూరి రంగారావు, మాటూరు శిరీష, క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	: పెళ్లికాని ప్రసాద్, దిల్‌రుబా, కోర్టు, షణ్ముఖ
దేవీ మల్టీప్లెక్స్	: కిస్ కిస్ కిస్సిక్, టుక్ టుక్, కోర్టు, కాలమేగా కరిగింది
లక్ష్మి	: కోర్టు
సత్యగౌరి	: పెళ్లికాని ప్రసాద్
తిరుమల	: సలార్
సీఅండ్‌సీ	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సీఅండ్‌సీ-2	: శబ్దం
శ్రీప్రియ	: సలార్
పద్మప్రియ	: ఎవడే సుబ్రహ్మణ్యం